# వైకుంఠపాళి

పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్ళి, బేతాళుడు పూనివున్న శవాన్ని చెట్టుపై నుంచి దించి, భుజం మీద వేసుకుని, మౌనంగా శ్మశానంకేసి నడవ సాగాడు.

అప్పుడు శవంలోని భేతాళుడు విక్రమార్కుడికి మౌనభంగం కలిగించాలనే ఉద్దేశ్యంతో "రాజా నీకు వినోదంగా వుండటానికి ఒక కథ చెబుతాను - విను" అంటూ యిలా చెప్పసాగాడు:

అనగా అనగా ఒక వూళ్లో ఒక ఆఫీసు వుండేది. ఆ ఆఫీసు కొక ఆఫీసరు వుండేవాడు. ఆయన కేవిషయమూ ఒక పట్టాన పట్టదు. అందుకని - ఆయన క్రిందే ప్రక్కవూళ్లో పని చేస్తున్న యింకో చిన్న ఆఫీసరుగారు ఎంత చెబితే, ఈయన అంతే చేస్తాడు. కారణం ఈ పెద్ద ఆఫీసరుగారెప్పుడో కష్టాల్లో యిరుక్కొని, పోలీసుల కళ్ళల్లో పడ్డప్పుడు - ఈ చిన్న ఆఫీసరుగారు తన చుట్టం అయిన ఒక పోలీసు ఆఫీసర్ను కలిసి, ఈయన్ని రక్షించారుట. అప్పటి నుంచి ఆ పెద్ద ఆఫీసరుగారికి చిన్న ఆఫీసరుగారంటే భయము, భక్తీ, కృతజ్ఞతానూ.

ఈ ఆఫీసరుగారి ఆఫీసులో చారుమతి అనే ఒక ఆడ క్లర్కు పని చేస్తున్నది. చాలా చురుకైనది ఆవిడ. కానీ ఆమె అంటే చిన్న ఆఫీసరుగారి కెందుకో నచ్చదు. కారణం ఆ అమ్మాయి ఎవరివేపూ చూడకుండా (ముఖ్యంగా చిన్న ఆఫీసర్‌గారి వేపు) తన పనేదో తను చూసుకుంటూ డిస్పాచ్‌లో అంత మంచి క్లర్క్ ఎక్కడా వుండదని నిరూపించుకోవడమే. ఆ అమ్మాయి భర్త కూడా అదే ఆఫీసులో టైపిస్టుగా పని చేస్తున్నాడు. యిక చిన్న ఆఫీసర్ గారికి ఈ అమ్మాయి అంటే నచ్చదు అన్నాం కదూ! ఈ అమ్మాయిని ఎలా ఏడిపించాలా అని దాదాపు సంవత్సరం ఆలోచించాడు. ఈ లోగా ఆ అమ్మాయి గర్భిణీ అయింది. ఏడవ నెల కూడా వచ్చింది. ఇంకా కొన్నాళ్ళలో మెటర్నరీ సెలవు మీద, మొదటి కాన్పు కనుక యింటికి కూడా వెడదామనుకున్నది. వాళ్లది చాలా అన్యోన్య దాంపత్యం అవటం వల్ల ప్రతిరోజు శంకర్రావు ( ఆ అమ్మాయి భర్త) ఆ అమ్మాయిని చాలా జాగ్రత్తగా రిక్షాలో ఆఫీసుకి

స్వయానా పినతల్లి కూతురు. అందుకే శంకర్రావ్ నాలుగు రోజుల్లో ఈ ఆఫీసర్ గారి ఆర్డర్ కాన్సిల్ చేయిస్తూ, తన భార్యను అక్కడ రిటైన్ చేస్తున్నట్టుగా ఆర్డర్ తెప్పించాడు. బిత్తరపోయిన ఆఫీసర్‌గారు సర్దుకుని, అతని భార్య బదులు శంకర్రావ్‌నే ఆ వూరు ట్రాన్స్‌ఫర్ చేద్దామని ప్రయత్నం చేయబోయాడు. కాని ఆ రోజే హైదరాబాదులోని పై ఆఫీసరుగారి నుంచి ట్రంకాల్ వచ్చింది - అటువంటి ప్రయత్నాలు చేయటం - ఆరోగ్యానికి మంచిది కాదని. అందుకనే ఆయన ఏం చేయలేకపోయాడు. యింతకీ చెప్పబోయేదేమిటంటే - పైన మనవాడంటూ ఒకడుంటే - చిన్నవాడే ఎన్నో పెద పనులు చేసేయగలడు. ఎలా వుంది నేను చెప్పిన మనవాడి కథ-" బేతాళుడు కథ పూర్తిచేసి విక్రమార్కుడ్ని అడిగాడు.

విక్రమార్కుడు పకపకా నవ్వాడు. "ఇది మామూలుగా చాలా ఆఫీసుల్లో జరిగే కథల్లాంటిదే - కానీ నేనో కథ చెబుతాను విను. ఈ కథ డిపార్టుమెంటు ఎడ్వంచర్లలో ప్రథమ స్థానం ఆక్రమిస్తుంది. యితరత్రా ఏమీ శక్తి లేని చిన్న వుద్యోగులు - భగవద్గీత లాగా పారాయణం చేసుకుంటూ - గొప్పగా చెప్పుకుని - ఆ గొప్పతనంలోనే తమ బీదతనం, అసహాయత, మరచి పోతుంటారు.

అనగనగా ఒక వూళ్లో ఒక ఎస్.యి.గారు (సూపరింటెండింగ్ యింజనీరుగారు) ఒకసారి తన క్రింద వున్న ఒక వర్క్‌స్పాటుకి యినస్పెక్షన్‌కి వెళ్లారు. అక్కడి సూపర్‌వైజర్ గారు పై ఆఫీసర్లకు కాకాలు కొట్టటం, కాఫీలు పోయించటం, కోడి పలావ్‌తో మేపటం ఏ మాత్రం నచ్చనివాడు. కొత్తగా కాలేజీలో నుంచి బయటపడి, వుడుకుతున్న రక్తం కలవాడు. పక్కన వున్న యిద్దరు ముగ్గురు చెప్పినా వినకుండా, ఎస్.యి. ఇన్‌స్పెక్షన్ రోజున ఆయన తిండికీ, త్రాగుడికీ ఏమీ ప్రయత్నాలు చేయలేదు. అందుకని ఎస్.యి. గారికి అందరి లాగానే కోపం వచ్చింది. సూపర్‌వైజర్‌గారి వర్క్కూ, వర్కుస్పాటూ అన్నీ బాగానే వున్నా - ఏమీ పని జరగటం లేదని, అదని - యిదని సణుక్కున్నాడు. పెద్దగా అందరితో అక్కడే అన్నాడు కూడాను. అంతటితో ఆగక పూల్స్, గీల్స్ అని మాటలూ మీరాడు. ఉడుకుతున్న సూపర్‌వైజర్‌గారి రక్తం బాగా మరిగింది. ఎస్.యి.గారు జీపు ఎక్కబోతుండగా దారికి అడ్డంగా నిలబడ్డాడు. ఆయన అన్నమాటలు ఉపసంహరించుకుంటే మర్యాదగా ఉంటుందన్నాడు.

డిపార్టుమెంట్ చరిత్రలోనే ఎస్.యి. అంతటి పెద్దవాడిని, సూపర్‌వైజర్ అనే చిన్నమనిషి ప్రప్రథమంగా ఎదిరించడం అపురూపం, ఆశ్చర్యకరం. అందువల్ల ఎస్.యి.గారు చాలా సేపటి వరకూ, తనెవరో, ఏ వూళ్లో ఉన్నాడో కూడా మరచిపోయి, నోట మాట రాక అలాగే నుంచున్నారు. కాసేపటికి తేరుకుని తనెవరో, అతనెవరో గుర్తు తెచ్చుకుని మండిపడ్డారు.

అయినా లాభం లేదన్నాడు సూపర్‌వైజరు.

"నేనెవరో తెలుసా ఎస్.యి.ని" అన్నాడాయన - నువ్వెవరో తెలుసా ఆఫ్టరాల్ సూపర్‌వైజర్‌వి అనే అర్థంతో.

'అయినా సరే ముందు మీరు అనవసరంగా మీరిన మాటలు ఉపసంహరించుకోండి' అన్నాడితను.

అతన్ని అడ్డులెమ్మన్నాడు ఎస్.యి.

"లేస్తాను అపాలజీ చెప్పండి సార్" అన్నాడు సూపర్‌వైజర్.

ప్రక్కనేవున్న మిగతా యింజనీర్లు, కొంచెం పెద్దవాళ్ళు, సూపర్‌వైజర్‌ని భయపెట్టారు. "ఆయ్ -- ఇంత పొగరు పనికిరాదు - ఆయన ఎవరనుకున్నావ్ - ఆయన తిడితే యింకా పెద్ద పెద్ద వాళ్ళే చిరునవ్వుతో స్వీకరిస్తారు, నువ్వేమిటి ఏదో పెద్దవాడిలా-" అన్నారు.

ఇతను ససేమిరా అన్నాడు. అలాగే దాదాపు ఒక గంటసేపు మండు టెండలో నిలబడ్డారు అంతా. ఒకరిద్దరు బలవంతాన అతన్ని ఎస్.యి.గారి దారికి అడ్డు తీయబోయారు. "నన్ను ముట్టుకుంటే మర్యాద దక్కదు జాగ్రత్త!" అని గట్టిగా అరిచాడతను - చొక్కా చేతులు పైకెత్తి. అతను మిష్టర్ కాలేజి అవటంవల్ల, అతని కండలు బాగా పుష్టిగా ఉంటాయి.

ఎండ ఎక్కువ కావటంవల్ల, అవమానం వల్ల ఎస్.యి గారికి చమటతో బట్టలు తడిసిపోతున్నాయి. చివరకు మెల్లగా, గాయత్రీ ఉపదేశం చేసినట్టు - సూపర్‌వైజర్ చెవిలో అపాలజీ చెప్పేశాడు.

సూపర్‌వైజర్ వెంటనే తప్పుకుని - "నమస్తే సార్!" అని ఆయనకు దారి యిచ్చాడు. జీపు దుమ్ములేపుకుంటూ వెళ్ళి పోయింది.

రొండో రోజునే ఎస్.యి. గారు హైదరాబాద్ వెళ్ళారు. ఆ సూపర్‌వైజర్‌ని ఏ పనిష్మెంటు ఏరియాకు ట్రాన్స్‌ఫర్ చేయించాలో కూడా ముందుగానే నిర్ణయించు కున్నాడాయన.

ఆయన వెళ్ళి పై ఆఫీసర్‌ని కలిశాడు. కలిసి - యిలా ఫలానా మనిషికి, ఫలానా చోటుకి ట్రాన్స్‌ఫర్ కావాలని చెప్పాడు.

"కొంచెం ఆగండి - ఇదిగో ఈ కాగితం మీకు పంపిద్దామను కుంటుండగా మీరే వచ్చేశారు" అంటూ ఎస్.యి. గారికి ఆ కాగితం అందించాడు ఆయన.

ఆ కాగితం చదువుకున్న ఎస్.యి.గారికి నోట మాట రాలేదు. సూపర్‌వైజర్ని ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయిద్దామనుకున్నాడో, అదే చోటికి తననే ట్రాన్స్‌ఫర్ చేస్తూ యిచ్చిన ఆర్డర్ అది.

ఇలా జరగటానికి కారణం అంతా - మనవాళ్ళే! సూపర్‌వైజర్ గారికీ ఒక 'మనవాడు' వున్నాడు. సూపర్‌వైజర్‌గారి బామ్మ తమ్ముడి మనవడి బావమరిది అప్పుడు మంత్రిగా వుంటున్నాడు. ఆయన్ని కలిసి విషయమంతా చెప్పాడు సూపర్‌వైజర్. తన మీద తప్పకుండా ఆయన ఏక్షన్ తీసుకుంటాడు కనుక, ఎలాగోలా ఎదురు దెబ్బకొట్టమన్నాడు. ఆయన గట్టి దెబ్బ కొట్టాడు. చూశావా, మనవాడంటూ ఒకడుంటే పెద్ద పెద్ద వాళ్లని శంకరగిరి మాన్యాలను దాటించవచ్చు!" అని ముగించాడు విక్రమార్కుడు.

ఈ విధంగా విక్రమార్కుడికి మౌనభంగం కావటంతో, బేతాళుడు శవంతో సహా మాయమయి చెట్టు ఎక్కాడు.

"ఈ బేతాళుడి శవాన్ని, మౌనభంగం కాకుండా తీసుకువెళ్లటానికి మనవాడెవడయినా సహాయంచేస్తే బాగుండు" ననుకుని, గాఢంగా నిట్టూర్చాడు విక్రమార్కుడు.

వైకుంఠపాళి